సాక్షి
శ్రీకాకుళం
సోమవారం : 10 : జూన్ : 2024



వేడుకగా ముగింపు
వేసవి శిక్షణ శిబిరాలు వేడుకగా ముగిశాయి. విద్యార్థుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.
- 2లో



ఆదిత్యుని సన్నిధిలో..
ఆదిత్యుడి సన్నిధి ఆదివారం కళకళలాడింది. పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు.
- 2లో



రోడ్డు ప్రమాదంలో..
కుశాలపురం ఫ్లై ఓవర్ వద్ద ప్రమాదం జరిగింది. యువకుడు మృతి చెందాడు.
- 2లో

న్యూస్‌రీల్

నేటి నుంచి ఏపీ పీజీ సెట్

ఎచ్చెర్ల క్యాంపస్: రాష్ట్ర విశ్వవిద్యాలయాల్లో ప్రవేశాలకు నిర్వహిస్తున్న పోస్టు గ్రాడ్యుయేషన్ ప్రవేశ పరీక్ష(ఏపీ పీజీసెట్ -2024) సోమవారం నుంచి ప్రారంభం కానుంది. ఈ పరీక్ష ద్వారా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం, అనుబంధ కళాశాలల ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల్లో పీజీ ప్రవేశాలు నిర్వహించనున్నారు. ఆన్‌లైన్ పద్ధతిలో నాలుగు పరీక్ష కేంద్రాలు నరసన్నపేట కోర్ టెక్నాలజీస్, టెక్కలి ఐతం ఇంజినీరింగ్ కళాశాల, చిలకపాలేం శ్రీ శివానీ ఇంజినీరింగ్ కళాశాల, ఎచ్చెర్ల శ్రీ వెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాలల్లో పరీక్షలు నిర్వహించనున్నారు. కోర్ టెక్నాలజీలో 10, 11, 12, 13 తేదీల్లో పరీక్షలు ఉండగా, మిగతా కేంద్రాల్లో 12వ తేదీన మాత్రమే ఉన్నాయి. పరీక్షలు రోజుకు మూడు షిఫ్టుల్లో నిర్వహిస్తున్నారు. ఉదయం 9.30 గంటల నుంచి 11 గంటలు, మధ్యాహ్నం 1 గంట నుంచి 2.30 గంటలు, సాయంత్రం 4.30 గంటలు నుంచి ఆరు గంటల వరకు పరీక్షలు మూడు షిఫ్టుల్లో నిర్వహించనున్నారు. హాల్ టిక్కెట్లు వెబ్‌సైట్‌లో అధికారులు అందుబాటులో ఉంచారు. ఆంధ్రా విశ్వవిద్యాలయం పరీక్షలు నిర్వహిస్తుంది.

కుందువానిపేట బీచ్‌లో వ్యక్తి గల్లంతు

గార: మండలంలోని వాడాడ పంచాయతీ అచ్చెన్నపాలెం గ్రామానికి చెందిన దివ్యాంగుడు అలిగి రాజేష్ (34) సమీపంలోని రూరల్ మండలం కుందువానిపేట బీచ్‌లో గల్లంతయ్యాడు. గ్రామంలోని కొందరు యువకులతో ఆదివారం ఉదయం కలసి వెళ్లిన రాజేష్ బీచ్ సమీపంలోనే భోజనాలు చేసి సాయంత్రం వేళలో సముద్రంలో స్నానానికి దిగాడు. ఆ సమయంలో ఒక్కడే నీటిలోకి దిగడంతో గల్లంతయ్యాడు. పోలీసులు, గ్రామస్తులు తీర ప్రాంతంలో గాలించారు.

విరగకాసిన మునగ



ఉద్దానంలోని మామిడిపల్లిలో ఒక రైతు తోటలో మునగ చెట్టు

పలాస: ఉద్దానం ప్రాంతంలో ఔషధ గుణాలు కలిగి మంచి పౌష్టికాహారమైన మునగ ఈ వేసవిలో విరగ కాసింది. ఈ ప్రాంతంలో జీడి మామిడి తోటల్లో, కొబ్బరి తోటల్లో అంతర పంటగా రైతులు సాగు చేస్తున్నారు. ఏటా మూడు కాలాల్లో ఈ పంట కాపునకు వస్తోంది. ఈ వేసవిలో మునగ బాగా కాసి, దిగుబడి వచ్చినా తగిన విధంగా రైతుకు గిట్టుబాటు కావడం లేదు. ఈ మునగ కాయలకు, మునగ ఆకులకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉన్నప్పటికీ దళారీల వల్ల రైతులకు తగిన లాభాలు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతులు నేరుగా పలాస కాశీబుగ్గ పట్టణంలో అమ్ముకోవడానికి రైతు బజారు ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.

14న ప్రపంచ రక్తదాన దినోత్సవం

శ్రీకాకుళం కల్చరల్: రెడ్‌క్రాస్ శ్రీకాకుళం శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 14న ప్రపంచ రక్తదాన దినోత్సవం నిర్వహిస్తున్నట్లు రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఈనెల 13న జిల్లాలోని విద్యార్థులకు రక్తదానంపై యువత పాత్ర అనే అంశంపై వ్యాసరచన పోటీ రెడ్‌క్రాస్ నైపుణ్యాభివృద్ధి కేంద్రంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పోటీల్లో పాల్గొనే విద్యార్థులు తమ పేర్లను 12వ తేదీలోగా రెడ్‌క్రాస్ కార్యాలయంలో నమోదు చేసుకోవాలని కోరారు. గెలుపొందిన వారికి బహుమతులు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు.

నృత్య పోటీల్లో ప్రతిభ చాటిన చిన్నారులు



ప్రశంసా పత్రాలతో నాట్య అకాడమీ విద్యార్థులు

సోంపేట: సోంపేట పట్టణంలోని శ్రీనటరాజ్ నాట్య అకాడమీ చిన్నారులు పూరి నృత్యోత్సవాల్లో పాల్గొని ప్రతిభ చాటారు. భారత్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం పూరిలో నృత్యపోటీలు నిర్వహించారు. నటరాజ్ నాట్య అకాడమీ విద్యార్థులు ఆశ్రీత, రోషివిక, జాను, మహా పాల్గొని ప్రదర్శన ఇచ్చారు. ప్రతిభ చాటిన చిన్నారులకు నిర్వాహకులు విజయ్‌కుమార్ సాహు తదితరులు ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు అందజేశారు.

కేంద్ర మంత్రిగా ఎర్రన్న తనయుడు

- క్యాబినెట్ మంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు
- తండ్రికి తగ్గ తనయుడిగా గుర్తింపు
- 36 ఏళ్ల వయస్సులోనే కేంద్ర మంత్రి బాధ్యతలు

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం

దివంగత కింజరాపు ఎర్రన్నాయుడు తనయుడు, ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు చిన్న వయసులో పెద్ద బాధ్యతలు అందుకున్నారు. టీడీపీ నాయకులు ప్రేమగా రాము అని పిలుచుకునే రామ్మోహన్ నాయుడిని 36 ఏళ్ల వయసులోనే కేంద్ర మంత్రి పదవి వరించింది. నరేంద్ర మోదీ మూడోసారి ఏర్పాటు చేసిన ప్రభుత్వంలో ఆదివారం రాత్రి క్యాబినెట్ మంత్రిగా ఆయన ప్రమాణ స్వీకారం చేశారు. తండ్రికి తగ్గ తనయుడిగా గుర్తింపు దక్కించుకున్న రామ్మోహన్‌నాయుడు.. జిల్లాలో ఎంపీగా హ్యాట్రిక్ కొట్టారు. చంద్రబాబుతో అత్యంత సన్నిహిత సంబంధాలు ఉండటంతో ఎన్‌డీఏ ప్రభుత్వంలో ఆయనకు క్యాబినెట్ ర్యాంకు మంత్రి పదవి దక్కింది.

36 ఏళ్ల వయస్సులో..

ఎంపీ రామ్మోహన్‌నాయుడు తండ్రి ఎర్రన్నాయుడు 37 ఏళ్ల వయస్సులో కేంద్రమంత్రిగా పనిచేశారు. ఇప్పుడు తనయుడు 36 ఏళ్ల వయస్సులోనే కేంద్ర మంత్రి పదవిని అలంకరించారు. దీంతో జిల్లా నుంచి కేంద్ర మంత్రి బాధ్యతలు నిర్వర్తించిన వారి సంఖ్య మూడుకు చేరింది. 1996లో యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వంలో ఎర్రన్నాయుడు కేంద్ర గ్రామీణాభివృద్ధి, ఉపాధి కల్పనా శాఖ మంత్రిగా పనిచేశారు. 2011లో కిల్లి కృపారాణి ఐటీ, కమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రిగా పనిచేశారు. అలాగే, ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలోని పాలకొండ, ఉణుకూరు నియోజకవర్గాలు కలిసి ఉన్న పార్వతీపురం ఎంపీగా ఎన్నికైన వైరిచర్ల కిషోర్ చంద్రదేవ్ కూడా చరణ్‌సింగ్(1979–80), మన్మోహన్ సింగ్ ప్రభుత్వం (2011–2014)లో కేంద్ర ఉక్కు, గనుల, బొగ్గు శాఖ మంత్రిగా, గిరిజన శాఖ మంత్రిగా, పంచాయతీరాజ్ శాఖా మంత్రిగా పనిచేశారు. ఆంధ్రరాష్ట్రం ఏర్పడక ముందు పాతపట్నం లోకసభ నుంచి గెలిచిన వీవీ గిరి కూడా ఆ తర్వాత ఎన్నికైన సందర్భంలో కేంద్రమంత్రిగా పనిచేశారు.



కుటుంబ నేపథ్యం..

కేంద్ర మాజీ మంత్రి, దివంగత నేత కింజరాపు ఎర్రన్నాయుడు, విజయకుమారి దంపతులకు శ్రీకాకుళం జిల్లా నిమ్మాడలో 1987 డిసెంబర్ 18న రామ్మోహన్‌నాయుడు జన్మించారు. ఈయనకు సోదరి భవానీ ఉన్నారు. ఈమె 2019 ఎన్నికల్లో రాజమహేంద్రవరం ఎమ్మెల్యేగా గెలిచారు. ఈయన బాబాయ్ అచ్చెన్నాయుడు గతంలో మంత్రిగా పనిచేశారు. ఎర్రన్నాయుడు టీడీపీలో కీలక నేతగా కొనసాగుతున్న సమయంలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో రామ్మోహన్‌నాయుడు రాజకీయ అరంగేట్రం చేశారు. మాజీ మంత్రి, విశాఖ జిల్లా టీడీపీ నేత బండారు సత్యనారాయణమూర్తి కుమార్తె శ్రావ్యను 2017లో వివాహమాడారు. వీరికి నిహిర అన్వి, శివాంకృతి అనే ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

విద్యాభ్యాసం

రామ్మోహన్‌నాయుడు ఒకటో తరగతి నుంచి మూడో తరగతి వరకు శ్రీకాకుళంలోని గురజాడ ఎడ్యుకేషన్ సొసైటీ హాస్టల్‌లో చదువుకున్నారు. 1994లో ఎర్రన్నాయుడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం పార్టీ చీఫ్ విప్‌గా ఎన్నికవ్వడంతో హైదరాబాద్‌కు మకాం మార్చారు. దీంతో 4,5వ తరగతులు హైదరాబాద్‌లోని భారతీయ విద్యా భవన్‌లో చదువుకున్నారు. 1996లో ఎర్రన్నాయుడు లోకసభకు ఎన్నికవ్వడంతో హైదరాబాద్ నుంచి ఢిల్లీకి కుటుంబమంతా షిఫ్ట్ అయ్యింది. దీంతో రామ్మోహన్‌నాయుడు ఆరో తరగతి నుంచి ఇంటర్ వరకు ఢిల్లీలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో చదివారు. ఆ తర్వాత ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లి అక్కడ ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ పూర్తి చేసి, ఆ తర్వాత అక్కడే ఉన్న లాంగ్ ఐలాండ్ విశ్వవిద్యాలయంలో ఎంబీఏ కూడా చేశారు. సింగపూర్‌లో ఏడాది పాటు ఉద్యోగం చేసి తర్వాత ఢిల్లీకి వచ్చేశారు. ఢిల్లీలో ఒక ఇంటీరియర్ డెవలప్‌మెంట్ కంపెనీ మార్కెటింగ్ వ్యవహారాలు చూసేవారు. ఎర్రన్నాయుడు 2012లో రోడ్డు ప్రమాదంలో మరణించడంతో ఉద్యోగం మానేసి శ్రీకాకుళం వచ్చేశారు. 2014 ఎన్నికల్లో ఎర్రన్నాయుడు వారసుడిగా రాజకీయాల్లోకి ప్రవేశించి తొలిసారి శ్రీకాకుళం ఎంపీగా పోటీ చేశారు. 26 ఏళ్లకే ఎంపీగా గెలిచి చరిత్ర సృష్టించారు. అక్కడి నుంచి వరుసగా మూడు సార్లు ఎంపీగా గెలిచారు. ఇప్పుడు 36 ఏళ్ల వయస్సులో కేంద్ర మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు.

● తల్లిదండ్రులకు పాదపూజ



మండల కేంద్రంలోని సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం తల్లిదండ్రుల పాదపూజ కార్యక్రమం నిర్వహించారు. సమాజంలో తల్లిదండ్రుల గొప్పదనాన్ని తెలియజేసేందుకు, పిల్లలకు తల్లిదండ్రులపై గౌరవం పెంచేందుకు ఇలాంటి కార్యక్రమాలు చేపడుతున్నట్లు సేవా సమితి సభ్యులు తెలిపారు. – సారవకోట

ఏపీ లాసెట్‌కు 555 మంది హాజరు

ఎచ్చెర్ల క్యాంపస్: జిల్లాలోని నాలుగు కేంద్రాల్లో ఏపీ లాసెట్–2024 (మూడేళ్ల, ఐదేళ్ల ఎల్‌ఎల్‌బీలో ప్రవేశాలకు) ఆదివారం ఆన్‌లైన్ పద్ధతిలో నిర్వహించారు. జిల్లా నుంచి 651 మంది దరఖాస్తు చేసుకోగా, 555 మంది హాజరయ్యారు. 96 మంది గైర్హాజరయ్యారు. పరీక్ష కేంద్రాలు వారీ హాజరు పరిశీలిస్తే నరసన్నపేట కోర్ టెక్నాలజీస్‌లో 330 మందికి 282, టెక్కలి ఐతం కళాశాలలో 120 మందికి 101, చిలకపాలేంలోని శివానీ ఇంజినీరింగ్ కాలేజ్‌లో 101 మందికి 94 మంది, ఎచ్చెర్ల శ్రీ వెంకటేశ్వర ఇంజినీరింగ్ కాలేజ్ లో 100 కి 78 మంది హాజరయ్యారు.

రంగస్థల కథానాయిక



తిరుపతిలో మహానటి సావిత్రి పురస్కారం అందుకుంటున్న రాజేశ్వరి



- 35 ఏళ్లుగా కళాసేవ చేస్తున్న రాజేశ్వరి
- విధి వ్రాత నాటిక ద్వారా కళారంగ ప్రవేశం
- 4వేలకు పైగా ప్రదర్శనలు
- ముత్యాలమ్మ కళానికేతన్ ద్వారా పరిషత్‌ల నిర్వహణ

శ్రీకాకుళం కల్చరల్: రంగస్థలం ఆమెను పెంచి పోషించింది. నటన ఆమె జీవితమైపోయింది. నాటక ప్రదర్శన జీవిత పరమార్థమైంది. సమాజంలోని మంచి చెడులను, అన్యాయాలను ఎత్తి చూపేందుకు చక్కటి వేదిక నాటకం. పౌరాణిక నాటకాలు పురాణ గాథలకు ప్రతి రూపాలు కాగా, సాంఘిక, జానపద నాటకాలు వర్తమాన సమస్యలకు దర్పణాలు. పట్టణంలోని గుజరాతీపేటలో నివాసం ఉంటున్న కేశిరెడ్డి రాజేశ్వరి గత 35ఏళ్లుగా నాటక రంగానికి సేవలు అందిస్తున్నారు. నాటితరానికి చెందిన హీరోయిన్ పాత్రలకు ఇద్దరు మాత్రమే నటీమణులు ఈ ప్రాంతంలో ఉన్నారు.

ఆమె కోసం..

రాజేశ్వరి స్వగ్రామం ఒడిశా రాష్ట్రంలోని కాశీనగర్ గ్రామం. కాగా ఈమె కళారంగంలోనే మేకప్ ఆర్టిస్టుగా ఉన్న శ్రీకాకుళం నగరానికి చెందిన శ్యామ్‌కుమార్‌ను వివాహం చేసుకున్నారు. మొదటగా తన 11 ఏళ్ల వయసులో విధివ్రాత నాటకంతో ప్రవేశం జరిగింది. పౌరాణిక, సాంఘిక నాటకాలలో చంద్రమతి, చింతామణి, బాలనాగమ్మ, సంగు, తార, చిత్రాంగి పాత్రలు పోషించారు. 4వేలకు పైగా సాంఘిక, పౌరాణిక ప్రదర్శనల్లో నటించారు. సినీ దర్శకులు, నిర్మాత ఆర్.నారాయణమూర్తి సినిమాలైన మార్కెట్‌లో ప్రజాస్వామ్యం, ఎర్రసముద్రంలో నటించారు. అలాగే ఇటీవల జయమ్మ పంచాయతీ, కన్యాకుమారి, పెళ్లయ్యింది కానీ సినిమాలలో నటించారు. అక్షరం శరణం గచ్ఛామి, తులసి తీర్థం, భారతమాత, సాయి మహిమలు, తిరుపతమ్మకథ, ఇదండి మా ఆయన సంగతి, పార్థవ, చిగురాకు, ఆమె ఓ కథ టీవీ సీరియళ్లలో కూడా నటించారు.

ఉత్తమ అవార్డులు

2006లో మృగం నాటికకు నంది అవార్డు, చట్టి పూర్ణయ్యపంతులు అవార్డు, తిరుపతిలో జేసీస్ తరఫున అవుట్ స్టాండింగ్ అవార్డు, తిరుపతిలో గరుడా అవార్డు, కళాజగతి అవార్డుతో పాటు ఎన్నో అందుకున్నారు. 150కి పైగా ఉత్తమ బహుమతులు అందుకున్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన 'కందుకూరి' పురస్కారాన్ని కూడా అందుకున్నారు. కళ్రి రంగారావు స్మారక పురస్కారం, సుబ్బరాజు కళాపరిషత్ ద్వారా 'మహానటి సావిత్రి' పురస్కారాన్ని అందుకున్నారు.

కళాకారుల సంఘంలో

రాజేశ్వరి కళాకారుల సంఘంలో కూడా ఉంటూ పలు పదవులు పోషించారు. సంయుక్త కార్యదర్శిగా, ఎగ్జిబిషన్ సొసైటీ సభ్యులుగా, జిల్లా జానపద కళాకారుల సంఘం అధ్యక్షులుగా ఉన్నారు.

నాటక పరిషత్‌ల నిర్వహణ

ఈమె సొంతంగా శ్రీముత్యాలమ్మ కళానికేతన్‌ను స్థాపించి దీని ద్వారా రెండు పరిషత్ నాటిక పోటీలు నిర్వహించారు. సాంఘిక, జానపద నాటకాలలో వివిధ పాత్రలను పోషిస్తూ నటిగా పాత్ర పోషణలో ఏ విధంగానూ రాజీ పడకుండా రాణిస్తున్నారు.



అడ్వాన్స్‌డ్‌లో అదరగొట్టారు

జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో జిల్లా విద్యార్థులు అదరగొట్టారు. చక్కటి ర్యాంకులు సొంతం చేసుకుని బంగారం లాంటి భవిష్యత్‌కు బాటలు వేసుకున్నారు. పలువురు పేదింటి విద్యార్థులు కూడా ఈ పరీక్షలో ప్రతిభ చాటుకున్నారు.

శ్రీకాకుళం న్యూకాలనీ

జేఈఈ అడ్వాన్స్‌డ్–2024 ఫలితాల్లో శ్రీకాకుళం జిల్లాకు చెందిన విద్యార్థులు విజయబావుటా ఎగురవేశారు. ఈ ఫలితాలు ఆదివారం వెలువడ్డాయి.

- జలుమూరు మండలం కరవంజకు చెందిన చింతు సతీష్‌కుమా ఆలిండియా ఓపెన్ కేటగిరిలో 367వ ర్యాంకు, ఓబీసీ కేటగిరిలో 88వ ర్యాంకుతో విజయబావుటా ఎగురవేశాడు.
- రాజాంకు చెందిన గొర్లె పవన్‌కుమార్ ఆలిండియా ఓపెన్ కేటగిరీలో 1004వ ర్యాంకు, ఓబీసీ కేటగిరిలో 153వ ర్యాంకు సాధించాడు.
- పోలాకిలోని శ్రీశయన వీధికి చెందిన పాలబోయిన ప్రణయ్ ఆలిండియా ఓపెన్ కేటగిరిలో 2735వ ర్యాంకు, ఓబీసీ కేటగిరిలో 481వ ర్యాంకు పొందాడు.
- శ్రీకాకుళంలో నివాసం ఉంటున్న బాడాన హితేష్‌కుమార్ ఆలిండియా ఓపెన్ కేటగిరిలో 3092 ర్యాంకు సాధించగా, ఓబీసీ కేటగిరిలో 542వ ర్యాంకు సాధించాడు.
- కోటబొమ్మాళిలోని పాతబస్టాండ్‌కి చెందిన సకలాభక్తుల సాయిబద్రీష్‌కు ఆలిండియా ఓపెన్ కేటగిరిలో 3230వ ర్యాంకు, ఈడబ్ల్యూఎస్ కేటగిరిలో 332వ ర్యాంకు వచ్చింది.
- సరుబుజ్జిలి మండలం రొట్టవలస గ్రామానికి చెందిన ఎం.అభిరామ్ ఆలిండియా ఓపెన్ కేటగిరిలో 3915వ ర్యాంకు, ఎస్‌సీఎల్ కేటగిరిలో 726వ ర్యాంకు సొంతం చేసుకున్నాడు.
- శ్రీకాకుళం నగరానికి చెందిన పసగాడ పవన్‌సాయి ఆలిండియా ఓపెన్ కేటగిరిలో 4442వ ర్యాంకు, ఓబీసీ కేటగిరిలో 837వ ర్యాంకు సాధించాడు.
- శ్రీకాకుళంలో నివాసం ఉంటున్న ఎల్.గిరిజాశంకర్ ఆలిండియా ఓపెన్ కేటగిరిలో 6928వ ర్యాంకు, ఓబీసీ కేటగిరిలో 1436వ ర్యాంకు సాధించాడు.
- టెక్కలిలోని రోటరీనగర్ ప్రాంతానికి చెందిన డోకి కమలేష్ ఆలిండియా ఓపెన్ కేటగిరిలో 7832వ ర్యాంకు, ఈడబ్ల్యూఎస్ కేటగిరీలో 957వ ర్యాంకు సాధించాడు.



సతీష్‌కుమార్ పవన్‌కుమార్ ప్రణయ్
బాడాన హితీష్ సాయిభద్ర ఎం.అభిరామ్
పవన్‌సాయి ఎల్.గిరిజాశంకర్ డోకి కమలేష్

- టెక్కలిలోని అయ్యప్పనగర్‌కాలనీకి చెందిన గడ్డిబోయిన దీక్షిత్ ఆలిండియా ఓపెన్ కేటగిరిలో 9474వ ర్యాంకు, ఎస్‌సీఎల్ కేటగిరిలో 2126వ ర్యాంకుతో మెరిశారు.

శ్రీచైతన్య విద్యార్థుల హవా..

శ్రీకాకుళం శ్రీచైతన్య జూనియర్ కళాశాలలో చదువుకుంటూ జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో పూర్తి హవా కనబర్చి విజయబావుటా ఎగురవేసిన విద్యార్థులను ఆ విద్యాసంస్థల డీఎస్ మురళీధర్, ఏజీఎం పి.నర్సునాయుడు, ప్రిన్సిపాల్ రామకృష్ణ తదితరులు అభినందించారు. మెరుగైన ర్యాంకులు సాధించి కళాశాలకు గర్వకారణంగా నిలిచారని కొనియాడారు.

నారాయణ కళాశాల విద్యార్థుల జోరు..

జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో ఆలిండియాస్థాయిలో నాణ్యమైన ర్యాంకులు సాధించి జోరు కనబర్చిన విద్యార్థులను ఆ విద్యాసంస్థల డీఎస్ మణికుమార్, ఏజీఎం తిరుపతిరావు, గంగాధర్, ప్రిన్సిపాల్ పి.ప్రసన్నకుమార్, జగన్, సత్యన్నారాయణ అభినందించారు. ఇంతటి అద్భుతమైన ఫలితాలకు కారకులైన విద్యార్థుల ప్రతిభను వారంతా ప్రశంసించారు.



తమ్మినేని అమృత గూన శేఖర్ సుధాన్వి హితన్‌సాయి

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధికి చెందిన నలుగురు విద్యార్థులు జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో మంచి ర్యాంకులు సాధించారు. కాశీబుగ్గకు చెందిన తమ్మినేని అమృత ఓపెన్ కేటగిరీలో 4557 ర్యాంకు సాధించగా ఓబీసీ ఎన్‌సీఎల్‌లో 865వ ర్యాంకు సాధించింది.

ప్రభుత్వ ఉపాధ్యాయులైన తల్లిదండ్రులు తమ్మినాన రామకృష్ణ, యాదవతిలు అభినందించారు. నందిగాం మండలం నందిగాం గ్రామానికి చెందిన జి.గుణశేఖర్ ఓపెన్ కేటగిరీలో 4828వ ర్యాంకు సాధించగా ఈడబ్లూఎస్ కేటగిరిలో 541 ర్యాంకు సాధించాడు. పలాసకు ఎందిన కొమురు సుధాన్వి ఓపెన్ కేటగిరిలో 6455 ర్యాంకు సాధించింది. కాశీబుగ్గకు చెందిన పొట్నూరు హితిన్‌సాయి ఓపెన్ కేటగిరీలో 9454 ర్యాంకు సాధించాడు.



తంగుడు దీపక్ సాయి ప్రణీత్ సావ్‌దీప్

నరసన్నపేట: నరసన్నపేటకు చెందిన తంగుడు దీపక్, గొండు సాయి ప్రణీత్, కోరాడ సావ్‌దీప్‌లు జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో సత్తా చాటారు. దీపక్ 596వ ర్యాంకు సాధించగా సాయి ప్రణీత్ 826వ ర్యాంకును, కోరాడ సావ్‌దీప్ 1265వ ర్యాంకు సాధించారు. తంగుడు దీపక్ తండ్రి తంగుడు పకీర్ ఆటో మొబైల్ షాపు నిర్వహిస్తుండగా తల్లి గృహిణి. అలాగే సాయి ప్రణీత్ తల్లిదండ్రులు ఇద్దరూ ఉపాధ్యాయులు. సావ్‌దీప్ తల్లిదండ్రులు కూడా ఉపాధ్యాయులే.



బత్తిని అవినాష్

వజ్రపుకొత్తూరు రూరల్: బాతు పురం గ్రామానికి చెందిన బత్తి నిఅవినాష్ సత్తాచాటాడు. ఆల్ ఇండియా ఓపెన్ కేటగిరీలో 17,262వ ర్యాంక్ కాగా ఆలిండియా ఓబీసీ కేటగిరీలో 4229 వ ర్యాంక్ సాధించాడు. వ్యవసాయ కూలీలైన తల్లిదండ్రులు తమ బిడ్డను కష్టపడి చదివించారు.



తల్లిదండ్రులతో సాయిరోహన్

కవిటి: కవిటికి చెందిన మొర్రి సాయిరోహన్ ఓబీసీ కేటగిరీలో 6160వ ర్యాంకును సాధించాడు. విద్యార్థి తండ్రి మొర్రి రవి ఎస్‌జీటీ ఉపాధ్యాయుడు. తల్లి రోజా కొత్తపాలెం కేజీబీవీ పాఠశాలలో కామర్స్ పీజీటీ.

నేటితో ముగియనున్న ఆప్షన్ల ఎంపిక

ఎచ్చెర్ల క్యాంపస్: పాలిటెక్నిక్ ప్రవేశాలకు సంబంధించి ఏపీ పాలీసెట్–2024 కౌన్సెలింగ్ చివరి దశకు చేరుకుంది. ఆప్షన్ల ఎంపిక ఏడో తేదీన ప్రారంభం కాగా, సోమవారంతో ముగియనుంది. 11వ తేదీన ఆప్షన్ల మార్పులకు అవకాశం ఇచ్చారు. 13వ తేదీన సీట్ల అలాట్‌మెంట్ ప్రకటిస్తారు. 14వ తేదీ నుంచి కళాశాలల్లో క్లాస్‌వర్క్ ప్రారంభిస్తారు. గత నెల 27వ తేదీ నుంచి కౌన్సెలింగ్ ప్రారంభించగా, 2307 మంది సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు హాజరయ్యారు. వెరిఫికేషన్‌కు హాజరైన అందరు విద్యార్థులు ఆప్షన్లు ఎంపిక చేసుకోవాలని పాలిటెక్నిక్ శ్రీకాకుళం ప్రిన్సిపాల్, కౌన్సెలింగ్ ఇన్‌చార్జి జి.దామోదర్‌రావు సూచించారు. సర్వర్లు నెమ్మదించటంతో విద్యార్థులు ఆదివారం ఇబ్బంది పడగా, సహాయ కేంద్రంలో సమస్య పరిష్కరించారు. విద్యార్థులు ఆప్షన్ల నమోదులో సమస్యలు ఉంటే సహాయ కేంద్రాన్ని సంప్రదించాలని సహాయ కేంద్రం సమన్వయకర్త మురళీకృష్ణ సూచించారు.

క్లుప్తంగా

పూర్వ విద్యార్థుల ఔదార్యం



గిరిజ కుటుంబానికి నగదు అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

బూర్జ: స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో 1990వ సంవత్సరంలో చదువుకున్న విద్యార్థులు తమ ఔదార్యం చాటుకున్నారు. వీరితో పాటు చదువుకున్న మహాపాత్రో గిరిజ భర్త అనారోగ్యంతో బాధ పడుతున్నారు. ఆమె కుమారుడు కూడా ఇటీవలే చనిపోయినట్లు తెలిసింది. వీరు వీరఘట్టంలో నివాసం ఉంటారు. విషయం తెలుసుకున్న పూర్వ విద్యార్థులు రూ. 57,500 పోగు చేసి ఆమెకు అందజేశారు.

డివైడర్‌ను ఢీకొన్న బైక్.. వ్యక్తి మృతి



రోడ్డుపై రమేష్ పాణిగ్రాహి మృతదేహం



ప్రమాదానికి కారణమైన స్కూటీ

కాశీబుగ్గ: పలాస మండలం కేదారిపురం పంచాయతీ కంబిరిగాం జాతీయ రహదారిపై ఆదివారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందారు. కాశీబుగ్గ పోలీసుల వివరాలు ప్రకారం.. సోంపేట మండలం బారువ గ్రామానికి చెందిన రమేష్ పాణిగ్రాహి లక్ష్మీపురం టోల్‌గేటు వైపు నుంచి పలాస వైపు తన బైక్‌పై వెళ్తూ డివైడర్‌ను ఢీకొట్టడంతో రోడ్డుపై పడిపోయారు. తల వెనుక భాగం రోడ్డుకు బలంగా తగలడంతో అక్కడికక్కడే ప్రాణాలు విడిచిపెట్టాడు. ప్రమాదంపై కాశీబుగ్గ ఎస్‌ఐ పారినాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గరుడఖండిలో పల్సర్ బైక్ చోరీ



దొంగిలించిన పల్సర్ బైకు (ఫైల్)

కాశీబుగ్గ: పలాస మండలం గరుడఖండి గ్రామం పెద్దవీధిలో పల్సర్ బైకు చోరీ చేశారు. గ్రామానికి చెందిన రోణంకి శశికుమార్ తన బంధువుల నుంచి తెచ్చుకున్న బైక్‌ను హ్యాండిల్ లాక్ వేసి ఇంటి ముందు ఉంచాడు. శుక్రవారం వేకువజామున మూడున్నర గంటలకు దుండగులు హ్యాండిల్ లాక్ కూడా తీసి బండిని తీసుకెళ్లిపోయారు. సీసీ పుటేజీలో ఇద్దరు వ్యక్తులు బైక్‌ను దొంగిలించినట్లు కనిపించింది. ఈ ఆధారాలను ఆదివారం వారు కాశీబుగ్గ పోలీసులకు అందజేశారు. కాశీబుగ్గ సీఐ విజయానంద జరిగిన సంఘటనపై కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం



రోడ్డు ప్రమాదంలో సంఘటన స్థలంలో మృతి చెందిన రామ్‌కుమార్



రామ్‌కుమార్ (ఫైల్)

ఎచ్చెర్ల క్యాంపస్: కుశాలపురం పంచాయతీ నవభారత్ వద్ద గల జాతీయ రహదారి ఫ్లై ఓవర్ వంతెనపై శనివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో పిన్నింటి రామ్‌కుమార్ (31) దుర్మరణం చెందాడు. యువకుడు శ్రీకాకుళంలో డీటీహెచ్ కేబుల్ నెట్‌వర్క్‌లో మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. స్వగ్రామం లావేరు మండలం వెంకటరావుపేట. శ్రీకాకుళం పట్టణం నుంచి స్వగ్రామానికి రోజూ బైక్‌పై వెళ్లి వస్తుంటాడు. శనివారం రాత్రి కూడా శ్రీకాకుళంలో పని ముగించుకొని స్వగ్రామం వస్తుండగా, నవభారత్ సమీపంలో ఫ్లై ఓవర్‌పై ఆగి ఉన్న లారీని ఢీకొట్టాడు. తలకు తీవ్ర గాయాలు కావడంతో సంఘటన స్థలంలోనే ఊపిరి వదిలేశాడు. రాత్రి యువకుడు ఇంటికి చేరకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందారు. ప్రమాదం వార్త తెలిసి కన్నీరుమున్నీరయ్యారు. మృతదేహానికి ఆదివారం పోస్టుమార్టం నిర్వహించి, బంధువులకు అప్పగించారు. మృతుడు అవివాహితుడు. తండ్రి పిన్నింటి అప్పారావు ఫిర్యాదు మేరకు ఎచ్చెర్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. జాతీయ రహదారిపై ఆగి ఉన్న వాహనాలు ప్రమాదాలకు తరచూ కారణమవుతున్నాయి.

వేడుకగా ముగిసిన వేసవి శిబిరం



చిన్నారులు రూపొందించిన చిత్రాలను చూస్తున్న అతిథులు



నృత్యంలో శిక్షణ పొందిన విద్యార్థులకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: వేసవి సెలవుల నేపథ్యంలో చిల్డ్రన్స్ లాఫింగ్ క్లబ్ ఆధ్వర్యంలో సుమారుగా 40 రోజులుగా నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరం ఆదివారంతో ముగిసింది. ఈ సందర్భంగా విద్యార్థులు నేర్చుకున్న అంశాలతో వారు రూపొందించిన డ్రాయింగ్, పెయింటింగ్స్, పేపర్, వ్యర్థాలతో తయారు చేసిన ఇంటి డెకరేషన్ హంగులతో చేసిన ప్రదర్శనలు అతిథులను ఆకట్టుకున్నాయి. అనంతరం జరిగిన సభలో పాల్గొన్న అతిథులు రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు, సింధూర ఆస్పత్రి వ్యవస్థాపకులు డాక్టర్ సింధూర, విశ్రాంత సెట్‌శ్రీ సీఈఓ సురంగి మోహనరావు తదితరులు మాట్లాడుతూ చిన్నారులను చక్కగా తీర్చిదిద్దారని ప్రశంసించారు. పాతశ్రీకాకుళంలోని కలెక్టర్ బంగ్లా ఎదురుగా ఉన్న ధర్మశాస్తా ఆలయం ఆవరణలో సమావేశం జరిగింది. అనంతరం చిన్నారులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. భరతనాట్యం నేర్చుకున్న చిన్నారుల ప్రదర్శన, సంగీతం నేర్చుకున్న చిన్నారుల ప్రదర్శన అలరించాయి. తర్వాత వేసవి శిబిరం నిర్వహించిన ఎల్.నందికేశ్వర రావు, బీఎంఎస్ పట్నాయిక్‌లను సత్కరించారు. కార్యక్రమంలో దేవభూషణరావు, కేవీజే రాధాప్రసాద్, టూరిజం అధికారి నారాయణరావు, నిక్కు హరిసత్యనారాయణ, నటుకుల మోహన్, పొన్నాడ రవికుమార్, సాక్షి మేనేజర్ స్వామి, విష్ణు, గుంపా శివప్రసాద్, ఎల్.రామలింగేశ్వరరావు, క్లబ్ నిర్వాహకులు ఎల్.నందికేశ్వరరావు, బీఎంఎస్.పట్నాయిక్, సాయిప్రసాద్, ఎల్.దీప్తి, పెంకి నాగేశ్వరరావు, టి.నీరజా సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థుల ప్రదర్శనలో ఉన్న పెయింటింగ్స్, బొమ్మలు



వ్యర్థాలతో తయారు చేసిన వస్తువుల ప్రదర్శన

ఆదిత్యుని సన్నిధిలో భక్తుల రద్దీ



ఆదిత్యుని ఆలయంలో సూర్యనమస్కారాలు చేస్తున్న దృశ్యం



ఆదిత్యుని సన్నిధిలో ఎస్పీ జీఆర్ రాధిక దంపతులు

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణస్వామిని భక్తులు ఆదివారం పెద్ద ఎత్తున దర్శించుకున్నారు. స్వామికి ఇష్టమైన రోజు కావడంతో ఇతర జిల్లాల నుంచి సైతం పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల కోసం ప్రత్యేక దర్శన ఏర్పాట్లు, మౌలిక సదుపాయాల చర్యలను ఆలయ ఈఓ ఎస్.చంద్రశేఖర్ చేపట్టారు. ప్రత్యేక అలంకరణతో స్వామి వారి దర్శనానికై అంతరాలయంలో ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో చర్యలు చేపట్టారు. భక్తులు ప్రత్యేక, విశిష్ట దర్శన మార్గాల స్వామిని దర్శించుకున్నారు. భక్తులు కేశ ఖండన శాలలో తల నీలాల మొక్కులు చెల్లించుకోగా ఆరోగ్యం కోసం సూర్య నమస్కారాల పూజలు చేయించుకున్నారు. ఒక్క రోజులో వివిధ దర్శనాల టికెట్ల ద్వారా రూ.6,09,300, పూజలు విరాళాల రూపంలో రూ.95,201, ప్రసాదాల విక్రయాల ద్వారా రూ 2.72 లక్షల మేరకు ఆదాయం లభించినట్లు ఈఓ చంద్రశేఖర్ వెల్లడించారు. అలాగే ఎస్పీ జీఆర్ రాధిక కుటుంబ సమేతంగా దర్శించుకోగా, అనకాపల్లి జిల్లా ఎస్పీ కేవీ మురళీకృష్ణ కుటుంబ సమేతంగా ఆదిత్యుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వీరి వెంట వన్‌టౌన్ సీఐ ఎల్.ఎస్.నాయుడు తదితరులు ఉన్నారు.

శ్రీముఖలింగేశ్వరుని సన్నిధిలో కాకినాడ ఎస్పీ

జలుమూరు: ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగంలో వెలిసిన మధుకేశ్వరుని కాకినాడ జిల్లా ఎస్పీ మురళీ దంపతులు సోమవారం దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు స్వామి వారికి ఏకవార అభిషేకాలు, అర్చనలు నిర్వహించి వారాహి అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. అనంతరం గోలెం మొక్కులు మొక్కి కానుకలు సమర్పించారు.

ఎస్పీ దంపతులకు అర్చకులు స్వామివారి శేష వస్త్రాలు, ప్రసాదం అందించి పుణ్యాహవచనాలతో దీవించారు. ఈ వారంలో వరుసగా సెలవులు రావడంతో జిల్లా నలుమూలల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి కూడా భక్తులు వచ్చారు.



అనకాపల్లి ఎస్పీ కేవీ మురళీకృష్ణకు ఆదిత్యుని జ్ఞాపికను అందజేస్తున్న ఈఓ చంద్రశేఖర్, శంకరశర్మ తదితరులు

‘ఆశ్రమాల్లో’ అడ్మిషన్లు

- విద్యార్థుల ప్రవేశాలపై ప్రధానోపాధ్యాయుల ఫోకస్
- ఆసక్తి చూపుతున్న విద్యార్థులు
- ఇప్పటికే కౌన్సెలింగ్ పూర్తి
- డ్రాపౌట్లు లేకుండా విద్యాశాఖాధికారుల చర్యలు
- 13న పాఠశాలలు పునఃప్రారంభం



మల్లి పీవీటీజీ పాఠశాలలో లాటరీ ద్వారా విద్యార్థులను ఎంపిక చేస్తున్న అధికారులు

సీతంపేట: కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా సర్కారీ పాఠశాలలను తీర్చిదిద్దడంతో ప్రవేశాలకు విద్యార్థులు ఎగబడుతున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు కూడా ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పిస్తే పిల్లల భవిష్యత్ బాగుంటుందని యోచించి మొగ్గుచూపుతున్నారు. 2024–25 విద్యాసంవత్సరానికి అడ్మిషన్లు జరుగుతున్నాయి. గిరిజన ప్రాంతాల్లో విద్యార్థులు గిరిజన విద్యా సంస్థల్లో చేరడానికి ఎక్కువగా ఇష్టపడతారు. ఇక్కడైతే అన్నిరకాల మౌలికవసతులు, విద్యతో పాటు ఉచిత వసతి, భోజన, వైద్య సదుపాయాలను కల్పిస్తారు. ప్రత్యేక మెనూ అమలు చేస్తారు. ఆంగ్ల మాధ్యమం బోధనతో పాటు అన్ని సబ్జెక్టులకు ఉపాధ్యాయులు ఉండడంతో చక్కనైన చదువు అందుతుందని వారి అభిప్రాయం. పదోతరగతిలో కూడా గడిచిన రెండేళ్లగా పార్వతీపురం మన్యం జిల్లా 96 శాతం ఫలితాలు సాధిస్తుండడంతో గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో సీట్లకు డిమాండ్ ఏర్పడింది.

ఇదీ పరిస్థితి..

సీతంపేట ఐటీడీఏ పరిధిలో 47 గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, 8 గిరిజన గురుకులాలు, 2 మినీ గురుకులాలు నిర్వహిస్తున్నారు. 226 గిరిజన ప్రైమరీ పాఠశాలలు నిర్వహణలో ఉన్నాయి. ఇప్పటికే ఆయా పాఠశాలల్లో 18,500 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇటీవల కాలంలో 2 వేల మంది వరకు విద్యార్థులు చేరారు. ఇంకా అడ్మిషన్ల ప్రక్రియ జరుగుతోంది. సీతంపేట, హడ్డుబంగి, పూతికవలస గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలల్లో సీట్లు కావాలని ఎక్కువగా వస్తున్నారు. మల్లి, దోనుబాయి, సీతంపేట ఆశ్రమపాఠశాలల్లో బాలురు ఎక్కువగా చేరుతున్నారు. భామిని, వీరఘట్టం, పాలకొండ, భద్రగిరి, జీఎల్‌పురం, పి.కోనవలస తదితర మండలాల్లో ఉన్న పాఠశాలల్లో అడ్మిషన్లు జరుగుతున్నాయి. ఇప్పటికే గిరిజన సంక్షేమ గురుకులాల్లో ప్రవేశాలకు ఎంట్రన్స్ పరీక్ష నిర్వహించి, ప్రతిభ ఉన్నవారిని చేర్చుకున్నారు. మల్లిలో ఉన్న ఏకైక పీవీటీజీ (పర్టికులర్లీ వల్నరబుల్ ట్రైబ్ గ్రూప్) గురుకులంలో లాటరీ ద్వారా మూడో తరగతిలో 80 సీట్లు భర్తీ చేశారు. సీతంపేట, కొత్తూరు మినీగురుకులాల్లో లాటరీ ద్వారా 105 సీట్లు భర్తీ చేశారు. ఇలా చాలా పాఠశాలల్లో అడ్మిషన్ల ప్రక్రియ పూర్తయింది. అంగన్‌వాడీ కేంద్రాలు నిర్వహిస్తున్న ప్రీస్కూల్స్‌లో 3–6 సంవత్సరాల వయసు ఉన్న వారు వేలాది మంది ఉన్నారు. వారిలో ఐదేళ్లు పైబడిన వారు వేల సంఖ్యలో ఉన్నారు. ఐదు సంవత్సరాల వయసు నిండిన వారిని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు అధికారులు దృష్టి పెట్టారు. జిల్లాలో 220 గిరిజన ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి.



హడ్డుబంగి ఆశ్రమపాఠశాలలో విద్యార్థినులను చేర్చుకుని అడ్మిషన్ పత్రం ఇస్తున్న హెచ్‌ఎం ఉమావాణి

నాణ్యమైన విద్య అందిస్తున్నాం



గిరిజన విద్యాసంస్థల్లో నాణ్యమైన విద్య లభిస్తోంది. అర్హత కలిగిన ఉపాధ్యాయులు ఉన్నారు. సబ్జెక్టు టీచర్ల కొరత లేకుండా అన్ని చర్యలు తీసుకున్నాం. మెనూతో రాజీ పడే ప్రసక్తి లేదు. పూర్తిస్థాయిలో మౌలికవసతులు కల్పించాం. అత్యాధునిక బోధన పద్ధతులు అవలంబిస్తున్నాం.

– అన్నదొర, గిరిజన సంక్షేమశాఖ డీడీ, సీతంపేట

మా పాప బాగానే చదువుతుంది



స్థానిక బాలికల ఆశ్రమ పాఠశాలలో మా కుమార్తె స్వాతి 8వ తరగతి చదువుతోంది. ఐదేళ్లుగా పైసా పెట్టుబడి లేకుండా చదువుతోంది. ఇక్కడ అన్ని సదుపాయాలు ఉన్నాయి. చదువులు బాగానే చెబుతున్నారు.

– ఎస్.జ్యోతి, విద్యార్థిని తల్లి, రాజన్నగూడ

శివానీ ప్రిన్సిపాల్‌కు ఎక్సలెన్స్ అవార్డు



శివానీ ప్రిన్సిపాల్ శ్రీనివాసరావుకి అవార్డు అందజేస్తున్న ఏయూ వీసీ ప్రసాద్ రెడ్డి

ఎచ్చెర్ల క్యాంపస్: చిలకపాలేంలోని శ్రీ శివానీ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎండ శ్రీనివాసరావుకి విశాఖపట్నంకు చెందిన భారత్ ఎడ్యుకేషన్ సంస్థ ఎక్సలెన్స్ అవార్డుకు ఎంపిక చేసింది. విశాఖపట్నంలో శనివారం జరిగిన ఓ కార్యక్రమంలో ఏయూ వీసీ ప్రొఫెసర్ పీవీజీడీ ప్రసాద్‌రెడ్డి చేతులమీదుగా అవార్డును స్వీకరించారు. విద్యారంగంలో చేసిన సేవలకు ఈ అవార్డు ఎంపికయ్యారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు సాంకేతిక విద్య అందిస్తుండటం, ఉత్తమ విద్యార్థులను తీర్చిదిద్దటం వంటి అంశాలు ఆధారంగా ఈ అవార్డుకు ఎంపిక చేశారు. మేనేజ్ మెంట్ సభ్యులు ప్రకటనలో ఆదివారం అభినందనలు తెలియజేశారు.

‘నీట్ పరీక్ష పేపర్ లీకేజ్‌పై విచారణ జరపాలి’



పలాసలో మాట్లాడుతున్న ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ రవి

కాశీబుగ్గ: ఇటీవల జరిగిన నీట్ పరీక్షలో పేపర్ లీకేజీపై విచారణ జరపాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ రవి డిమాండ్ చేశారు. పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీలో ఆ సంఘ భవనంలో విలేకరులతో మాట్లాడారు. దేశవ్యాప్తంగా ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో చదవడానికి నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహించిన పరీక్ష ఫలితంపై సిట్టింగ్ జడ్జి విచారణ జరపాలని ఏఐఎస్‌ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షులు సీహెచ్ రవి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన ఫలితాల్లో ఆరుగురు విద్యార్థులు 720 మార్కులకు 720 రావడం, ఆరుగురు ఒకే ఎగ్జామ్ సెంటర్‌కి సంబంధించిన విద్యార్థులు కావడం అనేక అనుమానాలను కలిగిస్తోందని అన్నారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ విడుదల చేసిన ఫలితాలపై కేంద్ర ప్రభుత్వం తక్షణమే విచారణ జరిపించి మెడికల్ విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా వేలాది మంది ప్రతిభ గల విద్యార్థులు మెడికల్ విద్యకు దూరం అవుతున్నారని అన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ నాయకులు పవన్, జస్వంత్, ధను తదితరులు పాల్గొన్నారు.

దమయంతక్క మరణం ఉద్యమానికి తీరని లోటు



దమయంతక్కకు నివాళులర్పిస్తున్న నాయకులు కార్యకర్తలు

పలాస: సీపీఎంఎల్ న్యూడెమొక్రసీ పార్టీలో పలాస కేంద్రంగా క్రియాశీలకంగా పాల్గొని ఉద్యమానికి ఊతం, ఉత్తేజాన్ని ఇచ్చిన దమయంతక్క మరణం ప్రజాఉద్యమానికి తీరని లోటని ఆ పార్టీకి చెందిన జిల్లా కార్యదర్శి వి.మాధవరావు ఆవేదన వ్యక్తం చేశారు. పలాస సూదికొండలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆమె సంతాప సభను నిర్వహించారు. ముందుగా అమరవీరులకు సంతాప సూచకంగా రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం మాధవరావు మాట్లాడుతూ దమయంతి సేవలను కొనియాడారు. శ్రీకాకుళ ఉద్యమ వేగుచుక్క చంద్రక్కతో కలసి పనిచేసిన జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. మెళియాపుట్టి ఏజెన్సీ ప్రాంతంలో గిరిజన ఉద్యమానికి ఆమె అహర్నిశలు పనిచేశారని, ఆనాడు అజ్ఞాత జీవితంలో ఉన్న వ్యక్తులను ఆదరించడమే కాకుండా పార్టీని బలోపేతం చేయడానికి ఎంతో కృషి చేశారని వివరించారు. ప్రజాజీవితంలో కూడా ఒక ఎంపీటీసీగా కరజాడ ప్రాంతంలో ప్రజల హక్కుల కోసం నిరంతరం పాటు పడ్డారని చెప్పారు. ఆమె సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ నాయకులు జుత్తు వీరాస్వామి, వంకల పాపయ్య, మామిడి భీమారావు, వినోద్, బదకల ఈశ్వరమ్మ, రాపాక చంద్రయ్య, బంగ్లా కుమార్, సోమేష్, రామారావు తదితరులు పాల్గొన్నారు.

గబ్బిలాల చింత తీరింది



మండలంలోని బెండి పరిసర ప్రాంతంలో ఉన్న చింత చెట్లు గబ్బిలాలకు ఆవాసాలుగా నిలుస్తున్నాయి. ఒకటి,రెండు గబ్బిలాలు కనిపిస్తే అబ్బో..అని అంటాం. అలాంటిది వందల సంఖ్యలో గబ్బిలాలు ఆహారం కోసం సాయంత్రం పూట ఎగురుతుండగా చూడడం వింత అనుభూతిని కలిగిస్తోంది.

– వజ్రపుకొత్తూరు రూరల్



రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

టెక్కలి రూరల్: మండలంలోని లింగాలవలస గ్రామ సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పాతపట్నం మండలం సీతారాంపల్లి గ్రామానికి చెందిన పాలవలస శంకర్ అనే వ్యక్తి తీవ్రగాయాలపాలయ్యాడు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. శంకర్ తన ద్విచక్రవాహనంపై టెక్కలి వచ్చి తిరిగి తమ గ్రామం వైపు వెళ్తుండగా లింగలవలస గ్రామ సమీపంలో అతని ద్విచక్ర వాహనం అదుపు తప్పి బోల్తా పడింది. ప్రమాదంలో శంకర్‌కి తీవ్రగాయాలు కావడంతో సమాచారం అందుకున్న 108 సిబ్బంది అతనికి ప్రథమ చికిత్స చేసి టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఘటనపై టెక్కలి పోలీసులకు సమాచారం అందించారు.